ప్రజాశక్తి
ఆదివారం 27 ఆగస్టు 2023
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగ్గునాయుడు, కుమార్, కృష్ణారావు

సిపిఎం సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను భారీగా పెంచి ప్రజలపై భారాలు మోపడాన్ని నిరసిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ పన్నుల భారాన్ని వ్యతిరేకిస్తూ, ఖాళీ పోస్టులు భర్తీచేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 4 వరకూ సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. శనివారం ఉదయం మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గునాయడు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి ప్రజలకు తెలియకుండానే ట్రూఅప్ ఛార్జీలు, మిగతా 2లో..

జిఎంఐఎస్ కోసం 28న డిసిఐ రోడ్ షో

నౌకాయాన అభివృద్ధికి 'గేట్ వే'గా అక్టోబర్ 17 -19 మధ్య గ్లోబల్ మారిటైం సమ్మిట్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ ఏడాది అక్టోబర్ 17 నుంచి 19 వరకూ న్యూఢిల్లీలోని ప్రగతి మైదానంలో గ్లోబల్ మార్కిటైం ఇండియా సమ్మిట్ - 2023ను కేంద్ర పోర్టులు, నౌకాయాన, జల రవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో విశాఖలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) ఈ నెల 28న రోడ్ షో నిర్వహించనుంది. ఈ క్రమంలో నగరంలోని సీతమ్మధార, హెచ్‌బి కాలనీలోగల ఆ సంస్థ నూతన కార్పొరేట్ కమ్యూనికేషన్స్ కార్యాలయంలో ఈ ఈవెంట్‌ను వర్చువల్‌గా నిర్వహించేందుకు డిసిఐ అధికారులు, ఉద్యోగులు సన్నాహాలు చేస్తున్నారు. వెరసి 'అంతర్జాతీయ సముద్ర వేడుక'కు డిసిఐ వేదిక కానుంది. వైజాగ్ పోర్టు అథారిటీ (విపిఎ) ఛైర్మన్ డాక్టర్ మధయ్యాన్ అంగముత్తు, డిసిఐ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ కెప్టెన్ ఎస్.దివాకర్ నేతృత్వంలో ఈ వర్చువల్ రోడ్ షో జరుగనుంది. ఈ సమ్మిట్ అంతర్జాతీయంగా నౌకాయాన పురోగతికి, కొత్త వనరుల అధ్యయనానికి ఎంతగానో దోహదపడుతుందని, సముద్ర తీర వ్యాపార బలోపేతానికి, పారిశ్రామికీకరణకు అవసరమైన బూస్టింగ్ ఇస్తుందని డ్రెడ్జింగ్ కార్పొరేషన్, పోర్టు అధికారులు వెల్లడిస్తున్నారు.

బ్లూ ఎకానమీ దిశగా భారత్

ఢిల్లీలో అక్టోబర్ 17 నుంచి 3 రోజుల పాటు జరుగనున్న ఈ సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పాటు నౌకాయాన రంగంలో ఉన్న మిగతా 2లో..

భీమిలి నియోజకవర్గంలో పార్లమెంటరీ బృందం పర్యటన

వార్త 3లో..

నళిని, కమలినిలకు వైశాఖి జీవన సాఫల్య పురస్కారం

పద్మశ్రీ నళిని, కమలిని

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రసిద్ధ కథక్ నృత్య కళాకారులు, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు నళిని, కమలిని సోదరీమణులు 'వైశాఖి జీవన సాఫల్య పురస్కారం-2023'కు ఎంపికయ్యారు. 15వ వార్షిక వైశాఖి నృత్యోత్సవం సందర్భంగా కళాభారతి ఆడిటోరియంలో సెప్టెంబర్ 15 నుంచి 17 వరకు జరిగే కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకుల చేతులమీదుగా ఈ పురస్కారాన్ని వారు స్వీకరించనున్నారు. ఎప్పటిలాగే తమ నిపుణుల కమిటీ ప్రమాణాల ప్రకారం కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతలు నళిని, కమలినిలను ఎంపిక చేసినట్టు నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు బత్తిన విక్రమ్ గౌడ్ వెల్లడించారు.

టౌన్ ప్లానింగ్‌లో పలువురికి ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : జివిఎంసి పట్టణ ప్రణాళిక విభాగంలో పలువురు అధికారులకు ఉద్యోగోన్నతులు కల్పించి వివిధ ప్రాంతాలకు శనివారం బదిలీ చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డిప్యూటీ డైరెక్టర్ హోదాతో ఉద్యోగోన్నతి కల్పించి అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావును విఎంఆర్‌డిఎకు ప్లానింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. మరో అసిస్టెంట్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

జిఎంఐఎస్ కోసం 28న డిసిఐ రోడ్ షో

పారిశ్రామిక వేత్తలు సైతం భాగస్వాములు కానున్నారు. పోర్టులు, తీర ప్రాంతం గుండా వ్యాపార లావాదేవీలు సాగించే వారంతా ఈ సమ్మిట్‌కు హాజరవుతున్నారు. దేశం బ్లూ ఎకానమీ దిశగా అడుగులు వేస్తుందని, సముద్రయాన రంగంలో వృద్ధిని సాధించడం, దేశంలో పోర్టుల కనెక్టివిటీని పెంచడమే దీని లక్ష్యమని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా నౌకాయాన వ్యాపార సహకారం కోసం ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి సముద్రయాన రంగం (మారిటైం సెక్టార్) ఎంతో పురాతనమైనది. ఎంతో అభివృద్ధిని సాధించింది. అంతర్జాతీయ వాణిజ్యంలో సరికొత్త సాంకేతిక అంశాల కోసం తాజాగా అన్వేషణ సాగిస్తున్న సందర్భంలో ఈ సమ్మిట్ ఎంతగానో ఉపయోగపడే అవకాశముందని డిసిఐ, పోర్టు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ సమ్మిట్‌లో సుమారు వంద దేశాలకుపైగా పాల్గొనే అవకాశం ఉందని తెలుస్తోంది. తీర ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనుల ద్వారా ఆర్థిక అవకాశాలను సృష్టించేందుకు ఈ సమ్మిట్ 'గేట్ వే' కానుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

సిపిఎం సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

వినియోగపు ఛార్జీలు, ఫిక్సిడ్ ఛార్జీల పేరిట భారాలు మోపిందన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు నేడు ప్రజలు మోయలేని భారంగా ఉన్నాయన్నారు. ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పుండుమీద కారం జల్లినట్టు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ఆస్తి పన్ను, చెత్త పన్ను, తాగునీటి ఛార్జీలు, రకరకాల యూజర్ ఛార్జీల పేరుతో భారీగా పన్నులు పెంచి ప్రజల నడ్డివిరుస్తోందని మండిపడ్డారు. తక్షణమే ప్రభుత్వాలు ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న విద్యుత్ అమరవీరుల సభను జగదాంబ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆ అమరవీరుల స్ఫూర్తితో మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 30, 31 తేదీల్లో నియోజకవర్గాల్లో పాదయాత్రలు చేపట్టి ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టనున్నామన్నారు. సెప్టెంబరు 1న సచివాలయాల వద్ద నిరసనలు ఉంటాయన్నారు. నిరుద్యోగుల సమస్యలపైనా, ఖాళీ పోస్టుల భర్తీ కోసం సెప్టెంబరు 3న యూత్ మార్చ్ జరుగుతుందన్నారు. సెప్టెంబరు 4న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని జగ్గునాయుడు పిలుపునిచ్చారు.

టౌన్ ప్లానింగ్‌లో పలువురికి ఉద్యోగోన్నతులు

సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న కె.జయరాంను విశాఖపట్నంలో ఉన్న రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు. గాజువాక ఎసిపిగా పని చేస్తున్న సంపూర్ణ మహాపాత్రను బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ చేయగా, అనకాపల్లి ఎసిపిగా పనిచేస్తున్న అరుణవల్లిని రాజమండ్రి రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఇక జివిఎంసిలో టిపిఒలుగా పనిచేస్తున్న శ్రీలక్ష్మి, రామకృష్ణలకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ హోదా కల్పిస్తూ జివిఎంసిలోనే పోస్టింగ్ ఇచ్చారు. వీరితో పాటు మరో ఇద్దరు జివిఎంసికి రానున్నారు. బొబ్బిలిలో పనిచేస్తున్న ఎస్.వెంకటేశ్వరరావుకు ఎసిపిగా ఉద్యోగోన్నతి కల్పించి జివిఎంసిలో నియమించగా, నందిగామలో పనిచేస్తున్న ఝాన్సీ రాణిని ఎసిపిగా ఉద్యోగోన్నతి కల్పించి జివిఎంసిలో పోస్టింగ్ ఇచ్చారు.

లోటస్‌లో అరుదైన శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైద్య చరిత్రలోనే విశాఖ లోటస్ హాస్పిటల్ ఫర్ వుమెన్, చిల్డ్రన్ ఎన్నో అరుదైన రికార్డులు సొంతం చేసుకుందని, ఈ క్రమంలో తల్లి, పిల్లల వైద్యంలో సరికొత్త అధ్యాయాన్ని సొంతం చేసుకుందని లోటస్ హాస్పిటల్ ఫర్ వుమెన్ అండ్ చిల్డ్రన్ చీఫ్ నియోనాటాలజిస్ట్, పీడియాట్రిషియన్ డాక్టర్ మురళి సంతోష్ తెలిపారు. శనివారం ఉదయం విశాఖలోని ఫోర్ పాయింట్స్ హోటల్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గడిచిన తొమ్మిది నెలల్లో తమ వైద్యుల బృందం 26 వారాల కంటే తక్కువ వయస్సు, చాలా తక్కువ బరువు ఉన్న 16 మంది శిశువులకు అరుదైన చికిత్సలను విజయవంతంగా అందించి 100 శాతం రికవరీ రేటును సాధించిందని వెల్లడించారు. చిన్నారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ లోటస్ హాస్పిటల్స్ యాజమాన్యం, డాక్టర్ మురళి సంతోష్, డాక్టర్ రమ్య, డాక్టర్ సంతోష్ కల్యాణ్ టీం సభ్యుల సేవలు తాము మరువలేమని చెప్పుకొచ్చారు. ఈ సక్సెస్ మీట్‌లో వైద్యులు డాక్టర్ రమ్య, డాక్టర్ సంతోష్ కల్యాణ్, డాక్టర్ శిరీషా రాణి, డాక్టర్ అనూష పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశాన్ని డెంగీ రహితంగా మార్చే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు డాబర్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్ హోమ్ కేర్ సనత్ పులిక్కల్ తెలిపారు. 'మేకింగ్ ఇండియా డెంగీ ఫ్రీ' క్యాంపెయిన్‌లో భాగంగా పెదవాల్తేరులోని కెడిపిఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం దోమకాటుపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో డెంగీ కలిగించే దోమల నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఒడోమస్ దోమల నివారణ క్రీములను ఉచితంగా పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంతోష్ జైస్వాల్, కెడిపిఎం ప్రిన్సిపల్ సుమతీబాయి పాల్గొన్నారు.

డ్యురియన్ ఫర్నీచర్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లగ్జరీ ఫర్నీచర్ బ్రాండ్ డ్యురియన్ ఫర్నీచర్ సంస్థ శనివారం విశాఖపట్నంలో తన నూతన స్టోర్‌ను ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇదే తమ మొదటి స్టోర్ అని సంస్థ ప్రతినిధి తెలిపారు. రైల్వే డిఆర్ఎమ్ ఆఫీసు ఎదురుగా దొండపర్తిలో ఉన్న తమ స్టోర్‌లో అత్యుత్తమ ఫర్నీచర్ లభిస్తుందని నిర్వాహకులు కొంచాడ హరిప్రసాద్ తెలిపారు.

పల్లెను పట్టిన దోమ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

స్థానిక సంస్థలను.. ప్రధానంగా పంచాయతీలను కొంతకాలంగా ప్రభుత్వాలు ఆర్థికంగా బలహీనపరుస్తూ రావడంతో వస్తున్న దుష్ఫలితాలిప్పుడు ఆందోళన కలిగిస్తున్నాయి. నిర్దయ పర్యావసానంపై విధానకర్తలకు స్పష్టతలేకపోయినా, వున్నా ముడుకుమెడ్డుతో వెళ్లిపోయినా ఆ ప్రభావం ఎలా పడుతుందో ఇప్పుడు పంచాయతీలను చూసినవారెవరికైనా అర్థమవుతుంది. సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ కాలంలో వాటిని నియంత్రించడానికి చర్యలు చేపట్టే పరిస్థితి పంచాయతీలకు లేకుండా ప్రభుత్వం చేసింది. గతంలో 14వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బిల్లులకు జమచేసినట్లే, ఈ ఏడాదీ 15వ ఆర్థిక సంఘం నిధులను వాటికి జమచేసి కనీస అవసరాల్లేని దుస్థితిని తీసుకొచ్చింది. పల్లెల్లో పేరుకుపోయిన చెత్తను తీయించడానికి, తీసిన పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించడానికి, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడానికి అవకాశం లేకుండా పంచాయతీలను తయారు చేసింది. డబ్బుల్లేక ఈ పనులేమీ చేయలేని పంచాయతీల్లో ఇప్పుడు డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. బ్లీచింగ్ కొనడానికి కూడా పైసల్లేని పంచాయతీలు జిల్లాలో బోలెడువున్నాయి. పంచాయతీల్లో చిన్నపాటి పనులు చేసేందుకు కూడా

డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నామని కొద్ది రోజుల క్రితం సర్పంచ్‌లంతా వీధుల్లోకి వచ్చారు. పంచాయతీలకొచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బిల్లులకు మళ్లించడంపై నిరసన తెలిపారు.

దోమల సమూహాలను నియంత్రించ లేకపోవడంతో ఇవుడవి మనుషులపై దాడిచేసి వ్యాధుల పాల్జేస్తున్నాయి. పారిశుధ్యంపై కొనసాగుతున్న నిర్లిప్తత వ్యాధులు ప్రబలడానికి దారితీసింది. వైద్య, ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం అనకాపల్లి జిల్లాలో 2022 జులై 31 నాటికి 110, విశాఖపట్నం జిల్లాలో 352 డెంగీ కేసులు నమోదైతే, ఈ ఏడాది జులై 31 నాటికి అనకాపల్లి జిల్లాలో 145, విశాఖపట్నం జిల్లాలో 516కు పెరిగాయి. అనకాపల్లి జిల్లాలో గతేడాది 38 మలేరియా కేసులు నమోదైతే ఈ ఏడాది 85కు పెరిగాయి. విశాఖలో గతేడాది 20 మలేరియా కేసులుండగా, ఈ ఏడాది 67కు పెరిగాయి.

ఇప్పటికైనా పెరుగుతున్న డెంగీ, మలేరియా కేసులను పరిగణనలోకి తీసుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేయాలి. నిధుల సమస్యలేని చోట సత్వరమే పనులు జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం చూడాలి. ఒకవైపు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటూనే, మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సకాలంలో సరైన సేవలందించేలా ఏర్పాట్లు చేయాలి. అవసరమైన మందులను సిద్ధం చేయాలి.

ఏపిఎల్, ఎసిఎ ప్లాటినం జూబ్లీ వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు 1983 వరల్డ్ కప్ హీరోలు విశాఖకు రాక

ప్రజాశక్తి - పిఎం.పాలెం : ఏపిఎల్, ఎసిఎ ప్లాటినం జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా 1983 క్రికెట్ వరల్డ్ కప్ హీరోలు రానున్నట్లు తెలిపారు. శనివారం పిఎం.పాలెంలోని క్రికెట్ స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎసిఎ జాయింట్ సెక్రటరీ రాకేష్‌తో కలిసి గోపీనాథ్ రెడ్డి పలు విషయాలు వెల్లడించారు. ఎసిఎ అధ్యక్షులు పి.శరత్ చంద్రారెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని యువ క్రికెటర్లలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారికి గొప్ప అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో గత ఏడాది ఏపిఎల్ - 1ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించామన్నారు. ఆ స్ఫూర్తితో ప్రస్తుతం సీజన్ - 2 చేపట్టామని తెలిపారు. ఆదివారం విశాఖలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ స్టేడియంలో జరగనున్న ఏపిఎల్ ఫైనల్‌కు మాజీ ఇండియా టెస్ట్ కెప్టెన్, బిసిసిఐ సీనియర్ సెలక్షన్ కమిటీ మాజీ ఛైర్మన్ కృష్ణమాచారి శ్రీకాంత్, అదేవిధంగా గౌరవ అతిథిగా మాజీ ఇండియా క్రికెటర్, ఇండియా నేషనల్ క్రికెట్ కోచ్ మదన్ లాల్ హాజరవుతారని వెల్లడించారు. ఏపిఎల్ ఫైనల్ మ్యాచ్‌ను చూసేందుకు ఐపిఎల్ టీం స్కౌట్స్ వచ్చారని, దీంతో యువ క్రీడాకారులకు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఎసిఎ ప్లాటినం జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా బిసిసిఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ, గౌరవ అతిథిగా మాజీ ఇండియన్ క్రికెటర్, ఇండియా నేషనల్ క్రికెట్ కోచ్ మదన్ లాల్ హాజరవుతారని తెలిపారు. మాజీ మెన్, ఉమెన్ రంజీ ప్లేయర్లు, కెప్టెన్లు, ఎసిఎ సిబ్బందితో ముఖాముఖి నిర్వహిస్తారని వెల్లడించారు. తొలి భారత టెస్ట్ కెప్టెన్, ఆంధ్ర రంజీ ట్రోఫీ జట్టుకు మొదటి కెప్టెన్ కల్నల్ సికె.నాయుడు కుటుంబ సభ్యులను సన్మానిస్తామని తెలిపారు. బిసిసిఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ వైజాగ్ రావడం వల్ల రాష్ట్రానికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా స్టేడియం ప్రాంగణంలో ఎసిఎ మాజీ కార్యదర్శి ఎన్.వెంకటరావు పేరిట స్టాండ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వేడుకల ఏర్పాట్లు వివరాలు వెల్లడిస్తున్న గోపీనాథ్ రెడ్డి

31లోగా మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 31లోగా మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, టైం బాండ్ అగ్రిమెంట్ అమలు చేయాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి యు.రాజు డిమాండ్ చేశారు. శనివారం జివిఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కుమార్‌కు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, జెఆర్.నాయుడు, శీర రమణ పాల్గొన్నారు.

మత్స్యకారుని ఆచూకీ కోసం ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 21న ఫిషింగ్ హార్బర్‌లో బోట్ నెంబర్ 374లో ఏడుగురు మత్స్యకారులతో కలిసి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో జారిపడి గల్లంతైన మత్స్యకారుడు మామిడిపల్లి అప్పన్న ఆచూకీ కనుగొనాలని, ఆయనను ప్రాణాలతో కాపాడాలని కోరుతూ శనివారం స్థానిక ఫిషింగ్ హార్బర్‌లోని మత్స్యశాఖ జెడి కార్యాలయం ఎదుట బాధిత కుటుంబ సభ్యులతో కలిసి మత్స్యకారులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిషింగ్ హార్బర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్, అధ్యక్షుడు వజ్రం, డాల్ఫిన్ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE COURT AT VIZIANAGARAM
S.O.P. 2/2022

Between:
Vadlapudi Parvathi & anothers ....Petitioners
And :
Vadlapudi Dhana Lakshmi ....Respondent

RESPONDENT

Vadlapudi Dhana Lakshmi W/o Late Sekhar, Hindu, aged 29years, Resident of Co-operative Bank Street, Near Jagga Rao Bridge, Akkayyapalem, Visakhapatnam.

పై నెంబరు SOP లో మీ యొక్క హాజరు నిమిత్తం పై కోర్టువారు పలుమార్లు మీకు కోర్టు ద్వారాను మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారాను కోర్టుకి హాజరు కమ్మని Summouns జారీ చేసినారు. అయినప్పటికి మీరు వాటిని ఉద్దేశపూర్వకంగాను తీసుకొనలేదు. మరియు కోర్టుకి హాజరు కాలేదు. అందుకు మీ హాజరు నిమిత్తం తేది 11-09-2023దిన పై తెలిపిన కోర్టులో మీ హాజరు కొరకు ఆదేశించియున్నారు. కావున మీరు <u>తేది 11-09-2023దీన ఉదయం గం॥10-30ని॥</u>లకు మీరుగాని, మీ ప్లీడరు గారు ద్వారాగాని హాజరు కావలసినదిగా ఈ ప్రకటన మూలకంగా తెలియజేయు చున్నాం. అట్లు మీరు కోర్టుకి హాజరు కాని పక్షంలో మీ పరోక్షంగా శ్రీ కోర్టువారు చర్య తీసుకుందురు అని తెలియజేయడం అయినది.

A.Harish
R.Ramakrishna
Advocate,
Opp: Dist Court Complex,
Vizianagaram
Cell: 9849944618, 9490682844

<u>C.P.C. Order 21 Rule 22 ప్రకారం</u>
<u>E.P. నోటీస్</u>
మహారాజశ్రీ చోడవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
<u>E.P. 26 / 2022 O.S. 24 / 2017</u>

మజ్జి ఈశ్వరమ్మ . . . D.Hr
V.R.J.V.S.కొండబాబు . . . J.Dr

<u>To:</u>
<u>J.Dr:</u> V.R.J.V.S.కొండబాబు
తండ్రి వెంకటరమణ
సా॥ వి.మాడుగుల గ్రామం,
వి.మాడుగుల మండలం,
అనకాపల్లి జిల్లా.

పైనెంబరు దావా డిక్రీ పరిహారం మీ నుండి D.Hr పొందు నిమిత్తం పై కోర్టులో పై నెంబరు అమలు దాఖలు చేయగా, సదరు విషయమై నీకు ఆక్షేపణలున్న <u>2023వ సంవత్సరం సెప్టెంబర్ నెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు</u> స్వయముగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరయి కోర్టువారితో మనవి చేసుకోవలసినది. లేనియెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని తెలియజేయడమైనది.

ఎం.ఈశ్వరరావు
డి.హెచ్.ఆర్. వాది తరపు అడ్వకేట్
వి.మాడుగుల గాదిరాయి, వి.మాడుగుల
తే:26-8-23

భీమిలి నియోజకవర్గంలో పార్లమెంటరీ బృందం పర్యటన

ప్రజాశక్తి- పద్మనాభం, ఆనందపురం : పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో పార్లమెంటరీ బృందం చైర్మన్ కరుణానిధి కనుమోజి ఆధ్వర్యాన శనివారం పర్యటించింది. రెడ్డిపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ప్రజలకు అందుతున్న సేవలపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్వాక్రా మహిళలతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రెండు గ్రూపులకు చెందిన ఇద్దరు మహిళలు వారి అనుభవాన్ని సభలో వివరించారు. ఈ కార్యక్రమానికి ముందు రెడ్డిపల్లిలో 2.5 ఎకరాల్లో పండించిన సపోటా తోటను పరిశీలించారు. ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు ఎస్.గిరిబాబు. ఎంపిడిఒ విజయ్‌కుమార్, తహశీల్దార్ శ్రీవల్లి, జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలంలో 25 మంది సభ్యులతో కూడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ శనివారం అభివృద్ధి పనులను పరిశీలించింది. శొంఠ్యాం గ్రామ పంచాయతీ పరిధి రామ్‌సాగర్, అమృత సరోవర్ ట్యాంకులను పరిశీలించారు. గ్రామ ప్రజలతో మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చందక గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న జగ్గురాజుపాలెం వద్ద భూముల రీ సర్వేకు సంబంధించిన డ్రోన్లు, పరికరాలు, ల్యాండింగ్ స్కెచ్‌లు, ఎగ్జిబిషన్‌లో ఉన్న పరికరాలను పరిశీలించారు. పిఎంజిఎస్‌వై రోడ్లును పరిశీలించారు. రైతులకు వ్యవసాయ రుణాలు, వివిధ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వే శాఖ ఏడీ కె.సూర్యారావు, ఎస్ఇ బిఎస్.రవీంద్ర, పీడీ డిడబ్ల్యుఎమ్ ఎ.సందీప్, భీమిలి ఆర్‌డిఒ భాస్కరరెడ్డి, మండల పరిపాలనాధికారి అడపా లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే పరికరాలను పరిశీలిస్తున్న పార్లమెంటరీ బృందం సభ్యులు కనిమొళి తదితరులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు ఐఎన్ఎస్ కళింగ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. మరో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. భీమిలి పోలీసుల కథనం ప్రకారం.. గీతం కళాశాల సిఎస్ఇ థర్డ్ ఇయర్ చదువుతున్న కిర్లంపూడి లే అవుట్, లాసెన్స్ బే కాలనీకి చెందిన పెండ్యాల ప్రఖ్యాత్ (20), సీతమ్మధారకు చెందిన కోలా అఖిలేష్, ఎండాడకు చెందిన ఆర్.సాయిలక్ష్మి భీమిలి నుంచి విశాఖ వైపుగా కారులో వస్తున్నారు. ఐఎన్ఎస్ కళింగ సమీపంలోకి వచ్చేసరికి కారు అదుపు తప్పి ఎడమ వైపున ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జు నుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవ్ చేస్తున్న పెండ్యాల ప్రఖ్యాత్ (20) తలకు బలమైన గాయాలయ్యాయి. అతని స్నేహితులు కోలా అఖిలేష్, ఆర్.సాయిలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉన్న ప్రఖ్యాత్‌ను చికిత్స నిమిత్తం స్నేహితులు గీతం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బ్రేక్ ఫాస్ట్ నిమిత్తం ముగ్గురు కారులో భీమిలి వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యారు. ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

138 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్:ముందస్తు సమాచారం మేరకు నర్సీపట్నం మండలం నెల్లిమెట్ట సమీపంలో ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 138 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు రూరల్ సీఐ రమణయ్య పేర్కొన్నారు. నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్లో శనివారం రాత్రి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు రూరల్ ఎస్సై తన సిబ్బందితో కలిసి నెల్లిమెట్ట సమీపంలో దాడులు చేశారన్నారు. మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న మట్టి రోడ్‌లో బొలెరో వ్యాన్‌లో 138 కిలోల గంజాయిని కారులోకి మారుస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరుగురుపై కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి రూ.1,02,600ల నగదు, ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన వివరించారు.

'పద్మనాభంలో రౌడీ సంస్కృతి'

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం మండలానికి రౌడీ సంస్కృతిని వైసిపి నాయకులు తీసుకొచ్చారని బిజెపి మండల అధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. ఇటీవల రేవిడి పంచాయతీ పరిధి రౌతులపాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికోద్యోగి మాపాడ ఆదినారాయణపై స్థానిక సర్పంచ్ కుమారుడు కోన రమణ కిరాయి రౌడీలతో హత్యాయత్నానికి పాల్పడడాన్ని ఖండించారు. గ్రామంలో ఉన్న చెరువులు, బంజరు భూములను కోన రమణ ఆక్రమించి, వైసిపి నాయకులు, అధికారుల సహకారంతో పట్టాలు చేసుకొని రూ.కోట్లలో ఆర్జిస్తున్నాడని, ఈయన ఆగడాలపై మాజీ సైనికుడు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆయనపై పగబట్టి రౌడీలతో హత్యయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇటువంటి నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వైసిపి తూర్పు సమన్వయకర్త ఎంవివికి అభినందనలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ తూర్పు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్తగా నియమితులైన ఎంపీ ఎంవివి సత్యనారాయణకు పలువురు అభినందనలు తెలిపారు. ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అల్లంపల్లి రాజబాబు, డైరెక్టర్ పేర్ల విజయచందర్, ఎస్సీ విభాగం తూర్పు ఇన్‌ఛార్జి గూడపాటి విక్టర్, నాయకులు పారిపల్లి రామారావు, సత్యాల వెంకట్, బెవర జగదీష్, మదు సంపత్ శనివారం ఎంవివి.సత్య నారాయణను కలిసి శాలువతో సత్కరించారు.

తర్లువాడ కొండ కబ్జాపై నిరసన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ చుక్కకొండను ఎంపీ విజయసాయిరెడ్డి కూతురు నేహారెడ్డికి విద్యాసంస్థల పేరుతో కబ్జా చేయడాన్ని వ్యతిరేకిస్తూ బిజెపి నాయకులు శనివారం కొండ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కెఎన్‌పి.చక్రవర్తి, మీసాల రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో నేలతేరు కెజిబివి విద్యార్థులకు వైజాగ్ వాలంటీర్స్ సంస్థ బూట్లు అందజేసింది. అనంతరం చేతితో తయారుచేసే అల్లికలను విద్యార్థులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిసి, జిసిడిఒ, వైజాగ్ వాలంటీర్స్ కార్యకర్తలు, ప్రిన్సిపల్ చంద్రకళ పాల్గొన్నారు.

సర్పంచ్‌గా జగదీశ్వరరావు ప్రమాణ స్వీకారం

సర్పంచ్‌ను అభినందిస్తున్న జెడ్‌పిటిసి, వైస్ ఎంపిపి తదితరులు

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా లచ్చుభుక్త జగదీశ్వరరావు శనివారం గ్రామ సచివాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఉప ఎన్నికల్లో జగదీశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామపెద్దలు, పలువురు ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, వైసిపి మండల అధ్యక్షుడు గాడు శ్రీను, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, సింగనబంద సర్పంచ్ గాడు వెంకటనారాయణ, మాజీ సర్పంచ్ జోగినాయుడు, గ్రామ పెద్దలు కెపి.సత్యనారాయణ, కనకల వెంకటరమణ, గాడు తాతినాయుడు, నీలాపు సూర్యనారాయణ, సచివాలయ కార్యదర్శి ఎ.సత్యసుధ, ఉద్యోగులు, సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు. పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రంలోకి బురదనీరు

ప్రజాశక్తి-సింహాచలం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రంలోకి వర్షం నీరు వచ్చి చేరడంతో ఆసుపత్రి ప్రాంగణమంతా బురదమయమైంది. ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు బురద నీటిని దారి మళ్లించేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. రెండు రోజులుగా ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రతకు శ్రమిస్తున్నారు. ఆసుపత్రి లోతట్టు ప్రాంతంలో ఉండడంతో కొండవాలు ప్రాంతం నుంచి వచ్చిన వర్షపునీరుతో ఆసుపత్రి బురద నీటితో నిండిపోయింది. అధికారులు స్పందించి ఆసుపత్రిలోకి వర్షపు నీరు రాకుండా చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందితో పాటు రోగులు కోరుతున్నారు.

ఆసుపత్రిలో చేరిన నీటినీ బయటకు తోడుతున్న సిబ్బంది

గీతం ఐఇఇఇ విద్యార్థి విభాగం సమావేశం

ముఖ్య అతిథులను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు సభ్యులుగా గల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ (ఐఇఇఇ) పవర్ ఇంజినీర్స్ సొసైటీ విద్యార్థి విభాగం శనివారం సమావేశమైంది. ఈ సమావేశానికి ఐఐటి భువనేశ్వర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాస్ భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, కృత్రిమ మేధకు సంబంధించిన అంశాలపై లోతైన పరిజ్ఞానం ఉన్నవారికి భవిష్యత్తులో డిమాండ్ ఏర్పడనున్నదని తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో వారికంటే ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివి ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌పై పట్టు ఉన్నవారు ఎక్కువ అవకాశాలు పొందుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్తు వాహనాల అభివృద్ధి, విండ్, సోలార్ ఎనర్జీ, బయోగ్రాస్ విధానంలో విద్యుత్తు ఉత్పాదన రంగాలలో అభివృద్ధిని వివరించారు. సంప్రదాయేతర ఇందన వనరులను నూతన టెక్నాలజీ జోడించి అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్తులో విద్యుత్తు కొరతను నివారించవచ్చన్నారు. కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగేంద్రప్రసాద్ అధ్యక్షత వహించగా ఇఇఇసిఇ విభాగం అధిపతి డాక్టర్ జెబి.సెవెన్త్‌లైన్, ఐఇఇఇ విద్యార్థి విభాగం కౌన్సిలర్ డాక్టర్ మహ్మద్ కెఎమ్.చిష్టి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ప్లాస్టిక్ అనర్థాలపై ప్రదర్శన

ప్రజాశక్తి- తగరపువలస : ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై శనివారం కళాకారులు పలు ప్రదర్శనలు నిర్వహించారు. జివిఎంసి ఆధ్వర్యాన నగరానికి చెందిన భద్రం ఫౌండేషన్ వెల్ఫేర్ సొసైటీ కళాకారులు స్థానిక జంక్షన్‌లో వీధి నాటిక ప్రదర్శించారు. జివిఎంసి 1, 2, 3, 4 వార్డుల పరిధిలో ఉన్న తగరపువలస, భీమిలి, చేపలుప్పాడ ప్రాంతాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు డేవిడ్‌రాజు, బి.సముద్రం, ఎన్.రంగబాబు, కె.చందు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు బీచ్ రోడ్డు మంగమారిపేట గో కార్డింగ్ మైదానంలో జనసేన పవర్ లీగ్ (జెఎస్‌పిఎల్) నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారం నిరహించారు. సెప్టెంబర్ 2న జన సేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా, మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ నక్కా శ్రీధర్ ఆర్థిక సాయంతో ఏర్పాటుచేసిన టోర్నమెంట్‌ను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్ తదితర నాయకులతో కలిసి పార్టీ నియోజక వర్గ ఇంఛార్జి పంచకర్ల సందీప్ బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొన్నాయి. పార్టీ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, ఇఎన్ఎస్.చంద్రరావు, బివి.కృష్ణయ్య, పరిమి భువనేశ్వరి, ఎరుసు సూరిరెడ్డి, గుడివాడ కిరణ్, శ్రీకాంత్, నవిరి రాజు, దివాకర్ పాల్గొన్నారు

నవోదయ ప్రవేశాల గడువు పొడిగింపు

ప్రజాశక్తి -పిఎం పాలెం : కొమ్మాది సమీపంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో రానున్న విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే గడువును మరోసారి పొడిగించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోపు www.nvs.gov.in వెబ్‌సైట్‌లోని లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని నవోదయ పాఠశాల ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు. ఆధార్ చిరునామా లేనివారు జిల్లాలో నివసిస్తున్నట్టు నివాస ధ్రువీకరణ పత్రం అప్‌లోడ్ చేసి రిజిస్టర్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

కణితి రోడ్డు విస్తరణకు కసరత్తు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కణితి రోడ్డు విస్తరించాలని గతంలోనే అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు 2011వ సంవత్సరంలో కొంతమేరకు కణితి రోడ్డును విస్తరించారు. కణితి రోడ్డు మార్కెట్ వరకు 100 మీటర్ల పొడవున విస్తరించి విడిచిపెట్టేశారు. తాజాగా మరల గాజువాక జోనల్ టౌన్ ప్లానింగ్ విభాగం రోడ్డు విస్తరణ సంబంధించి ఇటీవల సర్వే పూర్తిచేశారు. కోర్టు అడ్డంకులు లేకుండా ముందుగానే వ్యాపారస్తులతో మాట్లాడి సర్వే చేస్తున్నారు. 100 అడుగులు వెడల్పుతో విస్తరించాలని అనుకున్నారు. దీనిపై కొంత వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో 100 అడుగులు చేయాలా?, 60 అడుగులు చేయాలా అని జివిఎంసి అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

పాత గాజువాక, కొత్త గాజువాక రహదారి పూర్తిగా ట్రాఫిక్‌తో నిత్య రద్దీగా ఉంటోంది. అత్యవసర సమయంలో అంబులెన్స్‌కు కూడా దారి దొరకని పరిస్థితి ఉంది. దీంతో కణితి రోడ్డు విస్తరణ ప్రాధాన్యత సంతరించుకుంది. గాజువాక పంచాయతీగా ఉండగా ఏర్పాటుచేసిన కణితి రోడ్డును విస్తరించాలని కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడంతో ఈ రోడ్డుకు కదలిక వచ్చింది. ఈ రోడ్డును విస్తరిస్తే గాజువాకలో కొంతవరకు ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు భావిస్తున్నారు. కణితి రోడ్డు నుంచి జగ్గు సెంటర్ వరకు ఈ విస్తరణ చేపట్టనున్నారు. కణితి రోడ్డుకు ఆనుకుని ఉన్న గెడ్డపై గతంలో పది అడుగులు ఉండే వంతెనను 100 అడుగుల రోడ్డుకు సరిపడేలా విస్తరించారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు ఈ వంతెన నిర్మాణం చేపట్టారని అప్పట్లో అధికారులు చెప్పారు. వంతెనను 100 అడుగుల మేర నిర్మిస్తుండటంతో ఇప్పుడు రహదారి విస్తరణకు ఉపయోగపడే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

కణితి రోడ్డులో 100 అడుగులతో జరుగుతున్న కల్వర్టు పనులు

బెల్ ఎన్నికల గుర్తులు కేటాయింపు

ప్రజాశక్తి -గాజువాక : బిహెచ్ఇఎల్‌లో ఈ నెల 31న నిర్వహించే గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి శనివారం గుర్తులు కేటాయించారు. ఐఎన్‌టియుసి, సిఐటియు ఫ్రంట్‌కు, ఉదయించే సూర్యుడు, యునైటెడ్ ఫ్రంట్‌కు సింహం గుర్తు, బిఎంఎస్‌కు కాగడా గుర్తులు ప్రకటించారు. మొత్తం మూడు ప్యానళ్లు పోటీలో ఉన్నాయి.

ఎయులో ఇండస్ట్రీ 4.0 సెంటర్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఇండస్ట్రీ 4.0 కేంద్రం ఏర్పాటు కానుంది. భారత ప్రభుత్వ భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖకు అనుబంధంగా పనిచేసే సమ్రత్ ఉద్యోగ్ టెక్నాలజీ ఫోరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సదాశివ్ పాఢి, ఆపరేషన్స్ విభాగాధిపతి రాజేష్ వహేడిలు ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఏయూలో ఇండస్ట్రీ 4.0 కేంద్రం ఏర్పాటుకు అనువైన ప్రాంతం, భవనాలు తదితర అంశాలను పరిశీలించడానికి వచ్చారు. ఈ సందర్భంగా వీరు ఏయూలో ఇప్పటికే నిర్వహిస్తున్న పలు స్టార్టప్ సంస్థల పనితీరు పరిశీలించి, నిర్వాహకులతో మాట్లాడారు.

ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డితో పాలక మండలి సమావేశ మందిరంలో ఫోరం ప్రతినిధులు సమావేశమయ్యారు. త్వరలో కేంద్ర మంత్రిత్వశాఖ అనుమతి తీసుకొని ఎయులో సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎయు ఐపిఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం ఎయులో రూ.3 కోట్ల వ్యయంతో ఇండస్ట్రీ 4.0 ఏర్పాటుకు అవసరమైన ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను తీర్చిదిద్ది అందించారు. కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఎయు ఇంక్యుబేషన్ సెంటర్ సిఇఒ రవి ఈశ్వరపు, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులను వర్సిటీ తరపున సత్కరించారు.

శంకరమఠంలో
శబరిమల సమాచార కేంద్రం

ప్రజాశక్తి-సీతమ్మధార : శబరిమల ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు ఆధ్వర్యాన దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి సమాచారం కేంద్రాన్ని విశాఖపట్నం శంకరమఠంలో శనివారం ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షులు అనంతగోపన్ శనివారం ప్రారంభించారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ సహకారంతో శంకరమఠం, ట్రావెన్‌కోర్ దేవస్థానంబోర్డు ఒప్పందంతో ఈ సమాచార కేంద్రం ఏర్పాటు చేసినట్లు అనంతగోపన్ తెలిపారు. ఈ కేంద్రంలో వసతి గదులు, వర్చువల్ క్యూ లైన్, పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు వంటి సమాచారం లభ్యమవుతాయని పేర్కొన్నారు. శబరిమలలో 600 గదులు భక్తుల కోసం ఉన్నాయని, వాటిలో 120 గదులు ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చని చెప్పారు.

అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ, పూర్ణపుష్కళ ట్రస్ట్ ఆధ్వర్యాన నవంబరు 24, 25 తేదీలలో అయ్యప్ప మహాసంగమం నిర్వహిచనున్నట్లు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీయ అధ్యక్షుడు కె.అయ్యప్పదాసు, పూర్ణపుష్కళ ట్రస్ట్ చైర్మన్ పైల ఆదిమోహన్‌రెడ్డి తెలిపారు.


సంక్షేమ పథకాల కరపత్రాలను అందిస్తున్న కెకె.రాజు

26వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి రామకృష్ణనగర్ -2, చిన్నపూర్ మషీద్ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు వైసిపి ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, అమర్‌రెడ్డి, 26వ వార్డు నాయకులు పోతు సత్యనారాయణ, బాబీజన్, నవాబ్, ఎం.సునీల్, అనురాగ్, శేషు, బాబ్జి, పాండవ శ్రీను, రాయ్, అమ్మాజమ్మ, శ్యామల, గౌషియా, లలిత, అను, రమ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యపై దీక్ష, వంటావార్పు

సంఘీభావం తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి -ములగాడ : తూర్పు నావికా దళంలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యాన రెండు రోజులు దీక్ష, వంటా వార్పు కార్యక్రమాన్ని తూర్పు నౌకాదళ ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, కమాండ్ పరిధిలోని దీర్ఘకాలిక సమస్యలు, వైద్య సదుపాయాలు, హెచ్ఆర్ఎపై ఓటీ, ఇంక్రిమెంట్లు, పే ఫిక్సేషన్ సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమానికి వివిధ ట్రేడ్ యూనియన్లు సంఘీభావం తెలిపాయి. ఈ కార్యక్రమంలో ఎన్‌సిఇ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జి.మారుతి, పి.నాగేశ్వరరావు, తూర్పు నౌకాదళంలోని ఎన్ఎడి సిఇ యూనియన్, ఎన్‌బిసిసిఇ యూనియన్, ఎంఇఎన్‌సి యూనియన్, ఎన్ఎస్‌టిఎల్‌సిఇ యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలియజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెందుర్తి, సీతమ్మధార : పెందుర్తి నియోజకవర్గ పరిధి జివిఎంసి 96వ వార్డులో సుమారు రూ.2.06 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, స్థానిక టిడిపి కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. శనివారం వార్డులో పర్యటించి పలు ప్రాంతాలలో రోడ్లు, కాలువలు నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్, మేయర్ హరివెంకట కుమారి మాట్లాడుతూ, నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్లు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి వైసిపి ఇంఛార్జి అజయ్ రాజ్, వార్డు వైసిపి అధ్యక్షులు దాడి ఉమామహేష్, పార్టీ నాయకులు గొర్లె రాములునాయుడు, భగవాన్ జయరామ్, జోనల్ కమిషనర్, శరగడం నర్సింహమూర్తి, దొగ్గ గౌతమ్, లెక్కల రమేష్, కిల్లి అప్పారావు, లాలం అప్పలనాయుడు, అల్లం అప్పారావు, బంగారు నాయుడు, రొంగలి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు బిటిఆర్ కాలనీ సచివాలయం పరిధి రెల్లివీధి వద్ద రూ.1.32 కోట్లుతో కమ్యూనిటీ హాల్, డ్వాక్రా బిల్డింగ్ నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఆధ్వర్యాన మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ శ్రీనివాస్, ఎఇ శ్రీరామమూర్తి, వైసిపి నాయకులు నూకరాజు, బోగవల్లి గోవింద్, హరి, అశోక్, సమ్మెట వెంకటేష్, యు.సన్నీ, గుడివాడ గౌరినాయుడు, బి.కొండలరావు, యు.అప్పన్న, అల్లు దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

మణిపూర్ మారణకాండపై నిరసన

ప్రజాశక్తి -ములగాడ : మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మల్కాపురంలోని నవజ్యోతి పరస్పర సహాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యాన శనివారం ర్యాలీ, అనంతరం సమావేశం నిర్వహించారు. ర్యాలీని నవజ్యోతి మాక్స్ డైరెక్టర్ సిస్టర్ సంగీత ప్రారంభించి మాట్లాడారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడం అమానుషమని, నాగరిక సమాజం దీనిని ఖండించాలని పేర్కొన్నారు. మనిషికి మనిషికి మధ్య మానవత్వం ఉండాలని, కుల మతాలు కాదని అన్నారు. జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఐపిఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, మణిపూర్‌లో ఋకీలకు, మైథిలకు మధ్య జరుగుతున్న పోరాటం దేశాన్ని అనైక్యతకు గురి చేస్తోందని అన్నారు. ఎక్కడ మారణహోమం జరిగినా చివరకు బలయ్యేది మహిళలే అని, ఈ పరిస్థితి మారాలని పేర్కొన్నారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయదేవి, యానిమేటర్లు వెంకటలక్ష్మి, మేరీ, సుశీల, విజయ, హేమలత, తులసి తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు ర్యాలీ నవజ్యోతి మ్యాక్స్ నుంచి హాస్పిటల్ వరకు కొనసాగింది.

నేడు భెల్‌లో సభ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక భెల్ యూనిట్‌లో ఈ నెల 31వ తేదీన జరుగుతున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో భాగంగా ఆదివారం ఉదయం 10:30 గంటలకు గుర్తింపు యూనియన్ ఆఫీసులో సభ నిర్వహిస్తున్నట్లు ప్రచార కార్యదర్శి ఎస్.జగన్నాథరావు తెలిపారు. ఈ సభలో ఐఎన్‌టియుసి, సిఐటియు, వైఎస్ఆర్‌టియుసి, ఎఐసిటియు జిల్లా నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు.

మల్లేశం చిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి-సీతమ్మధార : చిత్ర ప్రదర్శనలో భాగంగా 2019లో రాజ్ రాచకొండ దర్శకత్వంలో రూపొంది, పలు జాతీయ అవార్డులు అందుకున్న మల్లేశం తెలుగు సినిమాను వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన శనివారం పౌర గ్రంథాలయంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ఇటీవల భారత ప్రభుత్వం ప్రకటించిన 69వ జాతీయ చలన చిత్ర పురస్కారాలలో తెలుగు సినిమాలు సత్తాచాటడం గర్వకారణమన్నారు. 69 ఏళ్లలో మొదటిసారి నటుడు అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు పురస్కారం రావడం పట్ల వైజాగ్ ఫిల్మ్ సొసైటీ తరపున అభినందనలు తెలిపారు. మొత్తం 11అవార్డులు పొందడం తెలుగు సినీ పరిశ్రమ స్థాయిని పెంచిందన్నారు. త్వరలో అవార్డులు పొందిన చిత్రాలతో రాష్ట్ర ప్రభుత్వ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో విశాఖలో జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో బి.చిన్నారావు, శ్రీమన్నారాయణ, అనురాధ, కాశీవిశ్వేశ్వరరావు, చాట్లా బాబూరావు, హుస్సేన్ పాల్గొన్నారు. చివరగా మల్లేశం చిత్రంపై సమీక్ష నిర్వహించారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి-సీతమ్మధార : టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా నడుచుకోవాలని జోన్-3 కమిషనర్ వై.విజయలక్ష్మి సూచించారు. కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రీ సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. భవన నిర్మాణదారులు జివిఎంసి నుంచి పొందిన ప్లాన్ అప్రూవల్ ప్రకారం నిర్మాణాలు జరిగేలా చూడాలని, బిల్డింగ్ నిర్మాణాలు చేస్తున్న యాజమాన్యాలు వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించేలా చూడాలని సూచించారు. అనంతరం రీ సర్వేకు సంబంధించి ట్యాబ్‌లను ప్లానింగ్ అధికారులకు ఆమె అందజేశారు. ఈ సమావేశంలో ఎసిపి శాస్త్రి టిపిఒ తేజ, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-రాంబిల్లి

నేవీ నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని ఒప్పందం ప్రకారం కాలపరిమితిలో పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. మత్స్యకారులు, రైతులు, వృత్తిదారుల ఆందోళన సందర్భంగా జరిగిన చర్చల్లో లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీల అమలుకు యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి చొరవ తీసుకోవాలన్నారు. రాంబిల్లి మండల సిపిఎం నాయకుడు జి.దేముడునాయుడు అధ్యక్షతన శనివారం జరిగిన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో లోకనాథం ఆయన మాట్లాడుతూ మూడు గ్రామాల పరిధిలోని 225 బోట్లకు నష్టపరిహారం చెల్లిస్తామని అంగీకరించి సగం మందికి ఇవ్వడం సరికాదని, ఒప్పందం ప్రకారం 225 బోట్లకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల వేటకు అనుమతి ఇవ్వాలని, నేవీ నిర్వాసిత కాలనీలో మౌలికసదుపాయాలు కల్పించాలని కోరారు. డెంగ్యూ, ఇతర వ్యాధులబారినపడ్డ నిర్వాసిత కుటుంబాలకు మెరుగైన వైద్యసదుపాయం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.నారాయణరావు, సిహెచ్ శివాజీ, సిహెచ్ నూకరాజు, సిహెచ్ అప్పలరాజు, డి.కాశయ్య, వై.రాము, రుత్తల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

కేసు వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి సుబ్బరాజు

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి -అనకాపల్లి

బాలిక కిడ్నాప్ కేసులో నిందితున్ని అరెస్టు చేసినట్టు డిఎస్‌పి సుబ్బరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం విలేకరుల సమావేశంలో డిఎస్‌పి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో అస్సాం రాష్ట్రం గౌహతికి చెందిన ఏలూసూరి ప్రసాద్‌బాబు 2021 జూలై 13వ తేదీన తీసుకెళ్లిపోయాడు. దీనిపై బాలిక తండ్రి నడిగట్ల శ్రీను పోలీస్ స్టేషన్లో జూలై 17న ఫిర్యాదు చేశాడు. ఈ కేసును రెండు సంవత్సరాలుగా పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేశారు. రూరల్ సీఐ రవికుమార్, రూరల్ కానిస్టేబుల్ నరేంద్ర కుమార్, అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భువనేశ్వర్‌లో ఉంటున్న ముద్దాయి ప్రసాద్ బాబును అరెస్టు చేశారు. బాలికను సంరక్షించి అనకాపల్లి తీసుకొచ్చారు. తదుపరి దర్యాప్తును డిఎస్‌పి సుబ్బరాజు చేపట్టి ముద్దాయి ప్రసాద్‌ను ఫోక్సో చట్టం కింద అరెస్టు చేసి జుడీసియల్ కస్టడీ నిమిత్తం 13వ అదనపు మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచారు. కేసులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని డిఎస్‌పి సుబ్బరాజు అభినందించారు.

స్టోర్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

పిఎంజె జ్యూయలర్స్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ఆభరణాల సంస్థ పిఎంజె జ్యూయలర్స్ విశాఖపట్నంలోని సిరిపురం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన తమ కొత్త స్టోర్‌ను శనివారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఈ నెల 26 నుంచి 31 వరకూ ఈ స్టోర్‌లో ఓ పెద్ద వెడ్డింగ్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. విఎంఆర్‌డిఎ ఛైర్మన్ విజయ నిర్మల ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై స్టోర్‌ను ప్రారంభించారు. పిఎంజె జ్యూయలర్స్ స్టేట్ హెడ్ హైదర్ అలీ, వైజాగ్ హెడ్ ఆనంద్ జిలగమ్, తదితరులు పాల్గొన్నారు. ఇది దక్షిణ భారతదేశంలో పిఎంజె జ్యూయలరీకి చెందిన 29వ స్టోర్ కావడం విశేషం. నూతన స్టోర్ ఆరంభం సందర్భంగా పెళ్లిళ్లు, పండగలు వంటి శుభకార్యాలతో పాటు అన్ని రకాల కార్యక్రమాల కోసం వివిధ డిజైన్లలో ఉన్న బంగారు ఆభరణాలను ప్రదర్శించారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - యలమంచిలి : స్థానిక మెయిన్ రోడ్డును ఆనుకొని 4, 5 సచివాలయాల ముందు గల ఖాళీ ప్రదేశంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే రమణమూర్తిరాజుతో కలిసి శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు తక్కువ ధరకే ఆహారం అందించేందుకు జిల్లాలోని నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీల్లో చెరొక క్యాంటీన్ నిర్వహణకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందని చెప్పారు. యలమంచిలి మున్సిపాలిటీలో అంజలి స్వయం సహాయక బృందం ఈ క్యాంటీన్ నిర్వహణ బాధ్యత తీసుకుందన్నారు. ఎమ్మెల్యే రమణమూర్తి రాజు మాట్లాడుతూ స్వయం సహాయక గ్రూపు సభ్యులు వెసులుబాటు ధరలకే టిఫిన్, భోజనం అందిస్తూ, స్వయం ఉపాధి పొందడం ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. ఉదయం టిఫిన్ నాలుగు ఇడ్లీ రూ.20, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు రూ.45కు అందించనున్నట్లు మెప్మా అధికార్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వీరయ్య, వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా, మెప్మా అధికారులు పద్మావతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్-2017లో 11వ ర్యాంకు సాధించిన ఐఎఫ్ఎస్ అధికారిణి విశ్వంజలి గైక్వాడ్‌తో శనివారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గైక్వాడ్ మాట్లాడుతూ తన తల్లి సేవా ఆధారిత విధానంతో ప్రేరణ పొంది సివిల్ సర్వీసెస్ వైపు తన ప్రయాణాన్ని సాగించినట్లు చెప్పారు. విద్యార్థులు అపజయంతో కుంగిపోకూడదన్నారు. తన మొదటి ప్రయత్నంలో ప్రిలిమ్స్ కూడా క్లియర్ చేయలేకపోయానని, అయితే తన దృఢ సంకల్పం రెండో ప్రయత్నంలో ఆలిండియా 11వ ర్యాంకు సాధించేలా చేసిందని గుర్తు చేశారు. చుట్టూ జరుగుతున్న విషయాల గురించి ప్రతిక్షణం తెలుసుకోవాలన్నారు. వివరణాత్మక దరఖాస్తు ఫారమ్‌ను సిద్ధం చేయాలని, అందులో రాసిన ప్రతి పదమూ చాలా ముఖ్యమైనదని, ఫారమ్ నింపేటప్పుడు, ఇంటర్వ్యూకి సిద్ధమవుతున్నప్పుడు అందులో రాసిన ప్రతిదాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. తమ పేరు నుండి ఫీల్డ్ వరకు, అభిరుచులు, డిఎఎఫ్‌లో రాసిన ప్రతిదానిపైనా బాగా ప్రిపేర్ అయ్యి ఇంటర్వ్యూకు వెళ్లాలన్నారు. కరెంట్ అఫైర్స్ ప్రిపరేషన్ కోసం, లేటెస్ట్ అప్ డేట్స్ కోసం నిత్యం న్యూస్ పేపర్ చదవాలని సూచించారు. ఇంటర్వ్యూ రోజున ఉదయం వార్తాపత్రికను చదవాలన్నారు. అనంతరం ఆమెను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంటరావు, కెరియర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ పల్లా వెంకట మురళి సత్కరించారు.

ఐఎఫ్ఎస్ అధికారి గైక్వాడ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని పిసిడికాడ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అధికారులను ఆదేశించారు. పిసినికాడ గ్రామంలో శనివారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. గ్రామంలోకి వెళ్ళినప్పుడు స్థానికులు తాగునీటి సమస్యను ప్రస్తావించారు. ఈ విషయమై స్పందించిన అమర్నాథ్ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జేజేయం మిషన్ కింద ఏర్పాటు చేసిన కుళాయిలకు కొంతమంది మోటర్లు బిగించడంతో, చాలామందికి నీరు అందడం లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆ మోటార్లను తొలగించి గ్రామస్తులందరికీ సక్రమంగా నీరందేలా చూడాలని మంత్రి ఆదేశించారు. స్థానికులు తమకు సొంత ఇల్లు కావాలని కోరడంతో సంబంధిత అధికారులను పిలిచి, అర్హులైన వారందరికీ ఇళ్ల మంజూరు చేయాలని సూచించారు. గ్రామంలో నాడు-నేడు నిధులు రూ.20.39 లక్షలతో అభివృద్ధి చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారులకు అందిస్తున్న ఆహార నాణ్యతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, గృహ సారథులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

5 నుండి 18 సంవత్సరాల బడి ఈడు పిల్లలందరూ బడిలోనే చదువుతూ ఉండాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి అన్నారు. శనివారం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన జిఈఆర్ గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో (స్థూల నమోదు నిష్పత్తి) శత శాతంగా ఉండాలన్నారు. ఊరిలో పాఠశాలలో కాకపోతే వారు ఎక్కడ చదువుతున్నది అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎంఈఓలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సెక్రటరీలు క్షుణ్ణంగా పరిశీలించి కచ్చితమైన సమాధానాన్ని ఈ నెల 30 నాటికల్లా తెలియజేయాలని ఆదేశించారు. ఆధార్ నెంబరు మిస్ మ్యాచ్ అవ్వడం, వలస వెళ్లడం మాత్రమే ఆప్షన్‌గా ఉండాలన్నారు. ఊరిలో ఉన్న విద్యార్థుల పూర్తి సమాచారం వెల్ఫేర్ సెక్రటరీలు తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిఎస్‌విఎస్ ప్రత్యేక అధికారి మంజుల వాణి, డివైఇవో సుజాత, డీఈవో వెంకట లక్ష్మమ్మ, డిప్యూటీ డిఇఓ రవిబాబు, జిల్లాలోని ఎంఈఓలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎక్కువ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరగాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో జరిగే ప్రసవాలు ఎక్కువగా ప్రభుత్వ డాక్టర్ల పర్యవేక్షణలో ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరగాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వైద్య ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కేసులు కూడా ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రులలోనే చికిత్స చేయాలని సూచించారు. కష్టతరమైన కాన్పుకు అవకాశం ఉండే గర్భవతులను ముందుగానే ఆసుపత్రులకు తీసుకురావాలన్నారు. స్టాఫ్ నర్స్, ఆశ కార్యకర్తలకు ముందస్తు చికిత్సల గురించి పూర్తి అవగాహన కలిగించాలన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ హేమంత్, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రవణ కుమార్, అనకాపల్లి, నర్సీపట్నం జిల్లా ఆసుపత్రుల సూపరిండెంట్లు, చోడవరం, నక్కపల్లి, మాడుగుల, ఎలమంచిలి, కోటవురట్ల, కె కోటపాడు ప్రాంతీయ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.

అసంపూర్తి భవన నిర్మాణాలు తక్షణమే పూర్తి

జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశం

ప్రజాశక్తి అచ్యుతాపురం

అసంపూర్తి భవన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశించారు. మండలంలోని నునపర్తి గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. నిర్మాణ దశలో ఉన్న భవనాలను, జగనన్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కలెక్టర్ దృష్టికి గ్రామ సర్పంచ్ చొక్కా అనురాధ, గ్రామస్తులు పలు సమస్యలను తీసుకెళ్లారు. ప్రధానంగా ఎన్‌టిపిసి విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిని ఎన్‌టిపిసి సిఎస్ఆర్ నిధులతో నిర్మించాలని కోరారు. రక్షిత మంచినీటి ట్యాంకు కూలిపోవడానికి సిద్ధంగా ఉందని, కొత్త ట్యాంకు నిర్మించాలన్నారు. పంచాయతీ పరిధిలోని నడింపల్లిలో పాఠశాల భవనం శిథిలమైందని చెప్పారు. ఈ సమస్యలను పరిష్కారం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్షులు గొంప నరసింహనాయుడు, మండల పరిషత్ పరిపాలన అధికారి డి.కృష్ణ, తహశీల్దారు వై.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, విఆర్ఒ అనంతరావు, పాల సంఘం అధ్యక్షులు రెడ్డి నరసింహారావు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని చరకాం గ్రామానికి చెందిన గొరుపుటి రాము (30) అదృశ్యంపై ఆయన అన్నయ్య అప్పలశెట్టి శనివారం కశింకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 22న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాము తిరిగి రాలేదని, బంధువుల గ్రామాల్లో వెతికామని, అయినా ఆచూకీ లభించలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కశింకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఉత్సాహంగా గ్రంథాలయ వార్షికోత్సవాలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో గల జోగినాయుడు మాస్టారు గ్రంథాలయ 12వ వార్షికోత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నిర్వాహకులు శనివారం విద్యార్థులకు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. గ్రంథాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పెతకంశెట్టి రామజోగి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, టిడిపి నాయకులు మల్ల వరాహనరసింగరావు, ఉపాధ్యాయులు పిల్ల జగదీష్, కొణతాల శివరామకృష్ణ, మల్ల కనుమ నాయుడు, ఎం.రవి పాల్గొన్నారు.

'మిలీనియం' టెస్టును సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించే మిలీనియం అపిట్యూడ్ టెస్ట్ -2023 (మాట్ టెస్ట్) మెరిటోరియస్ స్కాలర్ షిప్‌ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒఎల్ డేవిడ్ కోరారు. శనివారం ద్వారకానగర్‌లోని మిలీనియం సంస్థ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎటువంటి ఫీజు చెల్లించకుండా నిర్వహించే ఈ టెస్ట్ స్కాలర్‌షిప్ రూ.50 లక్షల విలువ చేస్తుందన్నారు. మొదటి ప్రైజ్ రూ.50 వేలతో పాటు టాప్ 5 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 50 శాతం రాయితీ, ట్యాబ్, ల్యాప్‌టాప్, మొబైల్ అందజేస్తామని చెప్పారు. అదేవిధంగా 6 నుంచి 500 ర్యాంకులు సాధించిన వారికి 35 శాతం ఫీజులను కోర్సులలో రాయితీ ఇస్తామన్నారు. 501 నుంచి 1000 ర్యాంకులు సాధించిన వారికి 25 శాతం రాయితీ కల్పిస్తామని తెలిపారు. ఈ స్కాలర్‌షిప్స్ కోసం బి.టెక్, ఎం.టెక్, ఎంసిఎ డిప్లొమా, డిగ్రీ చదువుతున్న వారితో పాటు 2022 - 2023 పాస్ అవుట్ అయిన విద్యార్థులు అర్హులన్నారు. మాట్.మిలీనియం సాఫ్ట్‌సోల్.కామ్‌లో అందరూ రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ పరీక్ష ప్రతి ఆదివారం మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్‌లో నిర్వహిస్తామని, మిగిలిన రోజుల్లో అయా కాలేజీల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9248753099, 9247866222 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మిలీనియం హెచ్‌అర్ బి.రమ్యశ్రీ, మార్కెటింగ్ మేనేజర్ ఎం.శివ, దివ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకే ఇసుక రవాణా

ప్రజాశక్తి-దేవరాపల్లి : మాడుగుల నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులకే దేవరాపల్లి పరిసర ప్రాంతాలలో ఉన్న ఇసుకను ప్రభుత్వ నిబంధనలకు లోబడి రవాణా చేస్తున్నారని జెడ్పిటిసి కర్రి సత్యం, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షులు బూరె బాబురావు తెలిపారు. శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా మంత్రి బూడి ముత్యాల నాయుడు నాయకత్వంలో రోడ్లు, ప్రభుత్వ భవనాలు, ఇళ్లు, జలజీవన్ పథకంలో భాగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. ఇక్కడి ఇసుకను ఇతర జిల్లాలకు, ఇతర నియోజకవర్గాలకు ట్రాక్టర్లు, లారీలు ద్వారా అక్రమంగా తరలించినట్లు రుజువు చేస్తే రాజకీయాలకు దూరంగా ఉంటామని వారు సవాల్ చేశారు. ఈ సమావేశంలో సర్పంచులు రెడ్డి సూర్యనారాయణ, గొర్రుపోటు సుధారాణి, దాసరి సంతోష్ కుమార్, తాడి సామాలు, కాటిపాము పెదనాయుడు, మహేష్ పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు కైరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. హైదరాబాద్ నుండి వచ్చిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే దశలో ఏమి అలవర్చుకోవాలి, అవి ఉన్నత శిఖరాలకు ఎలా తోడ్పడతాయి అనే అంశాలను తెలియజేశారు.

కశింకోటలో తోడపెద్దు సేవ గరిడీలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట గ్రామంలో నూతనంగా తోడపెద్దుకు అచ్చువేసి, సేవ గరిడీలో భాగంగా దానిని గ్రామ పురవీధుల్లో యాదవ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్‌పిపిలు పెంటకోట సుబ్బలక్ష్మి, పంచదార్ల లక్ష్మి, వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై విస్తృత ప్రచారం

ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 30 నుండి సెప్టెంబరు 4 వరకు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న తెలిపారు. మండలంలోని వాలాబులో సిపిఎం మండల కార్యదర్శి బిటి.దొర అధ్యక్షతన జరిగిన మండల విస్తృత సమావేశంలో ప్రచార పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు హద్దు అదుపు లేకుండా పెరుగుతున్నాయని, మోడీ గద్దెనెక్కిన నాటికి రూ.450 ఉన్న వంటగ్యాస్ నేడు రూ.1200కు చేరిందని, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు అంతులేకుండా పోయిందని తెలిపారు. ఉపాధి అవకాశాలు పూర్తిగా తగ్గిపోయి నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. ఈ పరిస్థితి మారాలంటే ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.నాగేశ్వరరావు, డి శంకర్, సిహెచ్.చినదేముడు, జె.పోతురాజు, కాశి ఈశ్వరావు, షేక్ అప్పాసాహబ్, జి గురువులు, ఇ ఈశ్వరరావు, డి సోమయ్య, ఇ.గోపాలుడు పాల్గొన్నారు.

రూ.85 లక్షలతో కొమ్మయ్య గుండం చెరువు అభివృద్ధి

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి నడిబొడ్డున, పాత జాతీయ రహదారికి ఆనుకొని నిరుపయోగంగా పడివున్న 1.70 ఎకరాల కొమ్మయ్య గుండం చెరువును రూ.85లక్షలతో పునరుద్ధణ చేపట్టి అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు తెలిపారు. ఇందుకు సంబంధించి అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ద్వారా ఈ పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. చెరువు చుట్టూ అందమైన మొక్కలు నాటి, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, కమిషనర్ వీరయ్య, డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా, ఎంపిపి బోదెపు గోవిందరావు, మాజీ ఎంపిపి బొద్దపు ఎర్రయ్యదొర, కౌన్సిలర్ కొల్లి త్రినాధ్, సర్పంచ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేకన్నబాబురాజు

మంత్రి అమర్‌నాథ్ అవినీతిపై చంద్రబాబుకు ఫిర్యాదు

చంద్రబాబుకు ఫిర్యాదు అందజేస్తున్న నాగజగదీష్

ప్రజాశక్తి- అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును శనివారం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు కలిసి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ చేస్తున్న అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేశారు. గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారాయుడు మంత్రి అమర్నాథ్‌కు తొత్తుగా వ్యవహరిస్తూ మంత్రి, ఆయన అనుచరులు చెప్పింది చేస్తున్నారని ఆరోపించారు. అనకాపల్లి మండలంలో మంత్రి అనుచరులు క్వారీ అనుమతులు లేకుండా అడ్డదారిలో కోట్లాది రూపాయల ప్రకృతి సంపదను తరలిస్తున్నారని తెలిపారు. అనకాపల్లి, కశింకోట మండలాల్లో కొండలను ధ్వంసం చేశారన్నారు. కశింకోట మండలం, జమాదులపాలెం గ్రామంలో బయ్యవరం సర్వే నెంబర్ 780లో 3.870 హెక్టార్లలో అనుమతి తీసుకొని, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేసి వందలాది భారీ వాహనాల్లో గ్రావెల్ తరలిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ కొండను తవ్వి రైతులకు కేటాయించిన స్థలాలను కబ్జా చేస్తున్నారన్నారు. అయినా గనులు, రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మంత్రి అమర్నాథ్ ముఖ్య అనుచరుడి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ అక్రమ గ్రావెల్ క్వారీపై అధికారులు పర్యవేక్షణ లేదన్నారు.

సరుగుడు సాగుపై రైతుల ఆసక్తి

చెరుకు గిట్టుబాటు కాకపోవడమే కారణం

సరుగుడు నారు తీస్తున్న రైతులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలో సరుగుడు సాగుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. దీంతో సరుగుడు నారుకు డిమాండ్ అధికంగా ఉంది. మండలంలోని పెద్ద మదీన, గున్నెంపూడి, రాజాం, తురకలపూడి, కందిపూడి తదితర గ్రామాల్లో పలువురు రైతులు సరుగుడు నారు పెంచి అమ్మకాలు చేస్తున్నారు. మండలంలో చెరుకు సాగు అధికంగా జరుగుతూ ఉండేది. అయితే చెరుకు గిట్టుబాటు కాకపోవడం, వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోవడం, ఆదాయం తగ్గిపోవడంతో చెరుకు సాగు రైతులకు కన్నీళ్లనే మిగుల్చుతుంది. దీంతో రైతులు ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో సాగయ్యో సరుగుడు సాగుపై ఆసక్తి చూపుతున్నాను. దీంతో సరుగుడు నారు ధర విపరీతంగా పెరిగిపోయింది. స్థానిక రైతులు పెంచే సరుగుడు నారు ధర గతంలో 1000 మొక్కల ధర 200 నుండి 300 వరకు ఉంటే అది కాస్త నేడు 1500కు చేరింది. జింజర్, క్రోన్ మొక్కల ధర సైతం విపరీతంగా పెరిగింది. జింజర్ ఒక మొక్క ధర నేడు రెండు రూపాయలపై మాటే. అదే క్రౌన్స్ మొక్క ఐదు రూపాయల వరకు ధర పలుకుతుంది. దీంతో పలువురు రైతులు స్థానికంగా దొరికే సరుగుడు నారుపై ఆసక్తి చూపుతున్నారు. సరుగుడు నారుకు ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు నారు పెంచుతున్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రోజారాణి

ఇళ్ల నిర్మాణం వేగవంతం

ప్రజాశక్తి-కశింకోట : జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి రోజారాణి సూచించారు. మండలంలోని తీడ గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమం సందర్భంగా జగనన్న కాలనీని పరిశీలించారు. ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణం ఏయే దశలో ఉన్నాయో పరిశీలించి నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చూడాలని హౌసింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిరికి సత్యనారాయణ, ఎంపిడిఒ వివి రవికుమార్, హౌసింగ్ ఏఈ వెలగా శ్రీనివాసరావు, ఎపిఒ శ్రీనివాసరావు, విఒఎ భవాని, మణిరాజు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని ప్రైవేటీకరిస్తే అంగీకరించేది లేదని స్టీల్‌ప్లాంట్ హెచ్ఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శనివారానికి 875వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు వి.అప్పారావు, కార్యదర్శి జివి.రమణ, అప్పారావు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కాశీపురం గ్రామంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని పెందుర్తి మాజీ శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబు శనివారం ప్రారంభించారు. అనంతరం పార్టీ మండల నాయకులు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రమేష్ బాబు మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రానున్న 2024 ఎన్నికల్లో పార్టీ అధికారంలో రావడం ఖాయమన్నారు. జనసేన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెడతామని చెప్పారు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి సాగనంపెందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి, అహింస రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. అనంతరం ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గుమ్మడి శ్రీరామ్, అంగ ప్రశాంతి, పసుపులేటి ఉషాకిరణ్, పివిఎస్ఎన్.రాజు, కోన తాతారావు తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో నేత్రదాన పక్షోత్సవాలు

ప్రజాశక్తి-పరవాడ : జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రంజిత్ మాట్లాడుతూ పౌష్టికాహారం లోపం, ఇన్ఫెక్షన్లు, కెమికల్ బర్న్, పుట్టుకతో వచ్చే లోపాలు, గాయాలు మొదలగు కారణాల వల్ల కంటిచూపు పోగొట్టుకున్న వారికి నేత్రదానం చాలా అవసరమని తెలిపారు. నేత్రదానం చేసేవారు తమ కుటుంబ సభ్యులకు నేత్రదానంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. నేత్రదానం చేసేవారు ముందుగా విశాఖలోని హనుమంతవాక వద్ద ఉన్న ఎల్‌వి.ప్రసాద్, ఐ ఇనిస్టిట్యూట్ వారికి సమాచారం తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ డాక్టర్ హారిక, సిహెచ్‌ఓ ఆర్.వెంకటరావు, పిహెచ్ఎన్ఎంఎస్ఎస్ సాయిరాం, యుడిసి జానకిరామన్, ఆనంద్ కుమార్, స్టాఫ్ నర్స్ రాజేశ్వరి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఘనంగా మదర్ థెరిసా జయంతి

కె.కోటపాడులో నివాళి అర్పిస్తున్న ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-యంత్రాంగం:

సేవలకు ప్రతిరూపంమదర్ థెరిసా ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని పలువురు కోరారు. అనకాపల్లి, విశాఖలో మధర్ థెరిసా జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.

గొలుగొండ:సేవకు మార్గం చూపిన మదర్ థెరిసా ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని గొలుగొండ శాఖా గ్రంధాలయాధికారి ఎన్.రాజుబాబు కోరారు. మదర్ థెరిసా జయంతిని శనివారం స్థానిక శాఖా గ్రంధాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి రాజబాబు, ఉపాధ్యాయులు భానోజీరావు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రాజుబాబు మాట్లాడుతూ, విదేశంలో జన్మించిన మదర్ థెరిస్సా భారతదేశంలో పలు సేవలందించారన్నారు.

యస్.రాయవరం:మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో మదర్ థెరిసా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్వి రమణారావు మాట్లాడుతూ, మథర్ థెరిసా పేదలకి రోగులకు స్వయంగా సహాయం చేశారని కొనియాడారు. ప్రపంచానికే ఆమె ఆదర్శం అన్నారు. విద్యార్థులకు ఆమె జీవిత చరిత్ర పై వ్యాచ రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీను, కుసుమ కుమారి, ఆర్ అప్పలనాయుడు, ప్రకాష్ పాల్గొన్నారు.

కోటవురట్ల:స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద థెరిసా సేవాసమితి నిర్వాహకులు రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా సేవా సమతి డైరెక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ,ప్రతి ఒక్కరు సాటి మనిషికి సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్, వైద్యులు కృష్ణంరాజు, జయహెూ భారత్ ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, ఎంపీటీసీ రాంబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక ఐదు రోడ్ల జంక్షన్లో శాఖ గ్రంధాలయంలో మదర్ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంధాలయధికారిణి పి. దమయంతి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దమయంతి మాట్లాడుతూ, ఆమె స్ఫూర్తితో పేద ప్రజలకు సేవలు చేయడానికి దాతలు, సామాజిక సేవ కర్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రభాకరరావు మాట్లాడుతూ, ఆమె చేసిన సేవలు మరువలేనివన్నారు.

కె.కోటపాడు :కారుణ్యంతో ప్రపంచాన్ని జయించవచ్చన్న మదర్ థెరిసా అమృత వాక్కులను అందరం ఆదర్శంగా తీసుకోవాలని ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. నోబెల్ బహుమతి గ్రహీత మదర్ థెరిసా జయంతి సందర్భంగా శనివారం స్థానిక అయ్యన్న విద్యాసంస్థల ప్రాంగణంలో థెరిసా విగ్రహానికి అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశీంతో కలిసి ముత్యాలనాయుడు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

వడ్డాది : అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు ఆధ్వర్యాన బుచ్చయ్యపేట మండలం వడ్డాది మెయిన్ స్కూల్ వద్ద, సబ్ స్టేషన్ వద్ద మదర్ థెరిసా జయంతి వేడుకలు సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం పురవీధుల్లో పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. థెరిసాపై వ్యాచారచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సబ్ స్టేషన్ వద్ద పిల్లలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టివి.శేషగిరిరావు ఏఈ సోమరాజు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయం జంక్షన్లో మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వినకోట నీలేశ్ గుప్తా, బల్లా శ్రీనివాసరావు, బూడిద జోగారావు, పిరాట్ల నరసింహ మూర్తి, బుద్ద నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

దేవరాపల్లి : స్థానిక శాఖా గ్రంథాలయంలో మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి ఓ.శ్రీనివాసరావు, గొల్లు రామమూర్తి పాల్గొన్నారు.

భీమునిపట్నం : వైఎంసిఎ అధ్యక్షులు, మదర్ థెరీసా అవార్డు గ్రహీత కెఎస్ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో స్థానిక బీచ్ రోడ్డులోని మదర్ థెరీసా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తగరపువలస పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు

ఆనందపురం : మండలంలోని వెల్లంకి టిఎస్ఆర్ కల్యాణమండపంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతిని జరిపారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్య సంఘం ఆధ్వర్యాన పలువురిని సన్మానించారు. మండలంలోని నీల్లకుండిలు వద్ద ఉన్న శ్రీసాయి స్వామి వివేకానంద పాఠశాలలో మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

వైసిపి జిల్లా కార్యదర్శిగా గోవిందరావు

ప్రజాశక్తి-నర్సీపట్నం: మాకవరపాలెం మండలం చామంతిపురం సర్పంచ్ బొడ్డు గోవిందరావును వైసిపి జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు పార్టీ కార్యాలయం నుండి ఉత్తర్వులు అందాయి. గోవిందరావునను ఎంఎల్ఏ పెట్ల ఉమా శంకర్ గణేష్ సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేసిన గోవిందరావుకు మంచి గుర్తింపు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం మండల పరిషత్ అధ్యక్షులు రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షులు వాసు, లో పెట్ల భద్రాచలం, రమణ పిల్లా శ్రీను పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పారిశుధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని దళితవాడల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని దళిత సేవా పరిరక్షణ జిల్లా అధ్యక్షులు యాదగిరి దాసు డిమాండ్ చేశారు. శనివారం రోలుగుంట ప్రత్యేకాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాల్లో 25 పంచాయతీల్లో ఎక్కడైనా ఒక్క డ్రైన్ అయినా నిర్మించారా..అని ప్రశ్నించారు. కనీసం కాలువలు, వాటర్ ట్యాంకులు పరిశుభ్రపరిచే పని కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎం. అప్పలరాజు, దళిత పక్షపాతి బంటు రాజు పాల్గొన్నారు.

గొలుగొండలో భారీ వర్షం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో పలు గ్రామాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. కేడీపేట, కొంగసింగి, నాగాపురం, లింగంపేట, చోద్యం, గొలుగొండ తదితర గ్రామాల్లో సుమారు మూడు గంటల పాటు కురిసిన ఈ వర్షంతో రైతాంగం హర్షం వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా వర్షాలు లేక వరి ఉడుపులకు నీరు కరువైంది. ఉడుపులు పూర్తయిన పొలాలకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు తెలిపారు.

మందుల కేస్ షీట్‌ను పరిశీలిస్తున్న వైద్యులు

146 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- కోటవురట్ల: సీజనల్ వ్యాధుల పట్ల గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యాధికారి సుధీర్ బాబు సూచించారు. శనివారం రామచంద్రపురం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురికి 146 మంది బీపీ, షుగర్ సహా పలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు పరిశుభ్రమైన తాగునీరు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ కిట్లు అందజేత

ప్రజాశక్తి-గొలుగొండ: జనసైనికులకు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వంతో భరోసా ఇస్తుందని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. శనివారం గొలుగొండలో జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలకు 5 లక్షల భీమా, ఏదైనా ప్రమాదం జరిగితే రూ.50వేల ప్రమాద భీమా కల్పిస్తారన్నారు. గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, మండల ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాద్‌బాబు, సీనియర్ నాయకులు రేగుబళ్ల శివ పాల్గొన్నారు.

వెండి ఆభరణాల వితరణ

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండకు చెందిన కీర్తిశేషులు కుంత్సం సత్యనారాయణ కుటుంబీకులు లింగంపేట నూకాలమ్మకు ఐదు లక్షల విలువైన వెండి ఆభరణాలను శనివారం వితరణ చేశారు. మండలంలో లింగంపేట గ్రామంలో నూకాలమ్మకు కుంత్సం కుటుంబం గతం నుంచి విశేష సేవలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం కుటుంబీకులు వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి కిరీటాలు, ఆభరణాలను అందజేశామని మాజీ ఎంపీపీ కుంత్సం లక్ష్మీనారాయణ, కుటుంబీకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బొండల రాజబాబు, ఆలయ కమిటీ చైర్మన్ బొండల నూకరత్నం, ఆలయ పూజారి గోలకొండ త్రిమూర్తులు, స్థానిక సర్పంచ్ తోకల సంతోష్ కుమార్, ఎంపిటిసి గొంతిన మహాలక్ష్మి, మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, దేవాలయ మాజీ చైర్మన్‌లు పండా హరేరామ్, గోలకొండ లింగయ్యలతో పాటుగా పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆభరణాలు అందిస్తున్న దాతలు

నేరాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి- నక్కపల్లి:ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నర్సీపట్నం సబ్ డివిజన్ క్రైమ్ స్పాట్ ఇన్చార్జి కే.శ్రీనివాసరావు ఎస్సై శిరీష ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులకు, కాగిత గ్రామంలో రామకృష్ణ జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులకు శనివారం నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. దొంగతనాలు జరగకుండా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు, నేర స్థల పరిరక్షణ, దిశా యాప్, టోల్ ఫ్రీ నెంబర్స్ 100,112పై అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న 100 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ కే.సువర్ణ, జీడిపిక్కల ఫ్యాక్టరీ మేనేజర్ వాసు, క్రైమ్ స్పాట్ సిబ్బంది భరత్, ప్రకాష్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్సై శిరీష

పాల్గొన్న భక్తులు

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయం శనివారం భక్తుల రద్దీతో కిటకటలాడింది. తెల్లవారుజామున గరుడాద్రి పర్వతంపై కల్కి వెంకటేశ్వర స్వామి మూలవిరాట్ కు ఆలయ అర్చకులు సంకర్షణ పల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు ప్రత్యేక అభిషేకములు, తీర్థ గోష్టి నిర్వహించారు. కొండ దిగువున ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి ఆలయం, ఉపాలయాలలోనూ ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి వేంకట శేషాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసులు, భాగవతం గోపాల ఆచార్యులు ఆధ్వర్యంలో నిత్య పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 1000 మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాల్య వివాహం నేరం

ప్రజాశక్తి -నక్కపల్లి:బాల్య వివాహం చేస్తే కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. మండలంలోని ఉపమాకలో పదో తరగతి చదువు కుంటున్న బాలికకు వివాహం చేస్తున్నారన్న సమాచారంతో ఐసీడీఎస్ సూపర్వైజర్ లలిత, పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్, వీఆర్వో దేవుళ్ళు, మహిళా కానిస్టేబుల్ హేమలత, అంగన్వాడి కార్యకర్తలు పద్మ, మాధవి తదితరులు బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. 18 సంవత్సరాల నిండకుండా ఆడపిల్లకు పెళ్లి చేస్తే వారి ఆరోగ్యం పాడవుతుందన్నారు.చట్ట ప్రకారం బాల్యవివాహాలు నేరమన్నారు. బాల్య వివాహాలను నిరోధిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు కొప్పిశెట్టి హరిబాబు, కొల్లాటి బుజ్జి పాల్గొన్నారు.

మూతపడిన పశువైద్య కేంద్రం

పశువైద్య కేంద్రం మూత

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండల కేంద్రమైన రాయవరం పశువైద్య కేంద్రం తెరవక పోవడంతో పశువైద్యానికై వచ్చిన పాడిరైతులు శనివారం వెనుతిరిగారు. ఏడాదికి పైబడి మండల కేంద్రమైన రాయవరం లో పశువైద్యాధికారి లేరు. దీంతో, పశువులకు సరైన వైద్యం అంద లేదని పాడిరైతులు వాపోతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో పాడి పశువులకు వివిధ రకాల వ్యాధులు సోకే అవకాశముంది. ఈ పశువైద్యశాలకు వచ్చినా సరైన సమాధానం చెప్పే నాధుడే లేడు.గత కొంతకాలంగా లింగరాజుపాలెం పశువైద్యాధికారిని ఇన్చార్జిగా నియమించినప్పటికీ ఆయన ఎప్పుడు వస్తారో ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి పశువైద్యాధికారిని నియమించి పాడిరైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బాధితులతో మాట్లాడుతున్న అధికారులు

స్పందన సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-కోటవురట్ల:ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా వచ్చిన స్పందన ఫిర్యాదుల పరిష్కారం కోసం శనివారం తహసిల్దార్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ ఆధ్వర్యంలో పలు ఫిర్యాదుదారులను సంబంధిత అధికారులు పరిష్కరించారు.కొడవటిపూడి రెవెన్యూ గ్రామంలో రహదారి వివాదం పరిష్కరించినట్లు తెలిపారు, అదేవిధంగా మండలానికి సంబంధించి ఇండేన్ గ్యాస్ డీలర్లు వినియోగదారుల నుండి అవకతవకలకు పాల్పడ్డారని వచ్చిన ఫిర్యాదు పై స్పందనలో చర్చించారు. ఈ విషయంపై ప్రస్తుతం సంబంధిత అధికారులు విచారణ చేపడుతున్నట్లు తహసిల్దార్ జానకమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, స్థానిక ఎస్సై నారాయణరావు, పిఆర్ ఇంజనీర్ వర్మ, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ కరుణ, హౌసింగ్ ఇంజనీర్ జగదీశ్వరరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి సరోజిని,ఏపీవో గంగు నాయుడు పాల్గొన్నారు.

వరి నాట్లలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వర్షాభావ పరిస్థితులతో వరి నారు ముదిరిందని, ఆ నారు నాటినప్పుడు కుదుళ్ల సంఖ్యను పెంచి 4, 5 మొక్కలు చొప్పున నాటు కోవాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని శనివారం గుల్లిపాడు, ముకుందురాజుపేట, రమణయ్యపేట గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పొలాలను పరిశీలించారు. నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25 శాతం పెంచి మూడు దఫాలుగా కాకుండా, రెండు దఫాలలో 70శాతం దమ్ములోను, మిగతా 30శాతం అంకురం దశ లో వేసుకోవాలన్నారు. వరి నారుమడులలో అక్కడక్కడ గుంపులు గుంపులుగా నారు చనిపోతుందని, ఇది పొడ తెగులు లక్షణమని, దీనిని నివారించేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ తెగులు ఉధృతి పెరగకుండా నారుమడి కాపాడుకోవడం కోసం వెంటనే లీటర్ నీటికి 2 మిల్లీ లీటర్ల చొప్పున హెక్సాకొనజోల్ మందును కలిపి, ఎకరా నారుమడికి కనీసం ఒక ట్యాంకు పిచికారి చేయాలన్నారు. ఇప్పటికే వరి ఉడుపులు పూర్తయి 15 రోజులు దాటిన పొలాల్లో అంబటి కాడ, గరిక, తీగజాతి, తుంగ వంటి గడ్డి జాతి కలుపు మొక్కలు ఉన్నాయని, వీటి నియంత్రణకు బిస్ ఫైరీబ్యాక్ సోడియం కలుపు మందును 80-100 మిల్లీలీటర్ల చొప్పున, ఆల్ మిక్స్ 8 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలుపుకొని ఎకర పొలంపై పిచికారి చేస్తే అన్ని రకాల కలుపు మొక్కలు చనిపోతాయన్నారు.ఖచ్చితంగా వరి పొలాలలో 20 రోజులలోపు ప్రతి రెండు మీటర్ల కి ఒక అడుగు చొప్పున కాలిబాటలు తీసుకోవాలని ,తద్వారా గాలి, వెలుతురు పొలంలో బాగా తగిలి చీడపీడల ఉధతి తగ్గుతుందన్నారు. వరి ఉడి చేటప్పుడు ఎరువులు వేయని రైతులు ఎకరానికి ఒక బస్తా డిఏపి, 20 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రి శ్రీనివాస్, గ్రామ సహాయ వ్యవసాయ అధికారులు రాజేష్, సత్యనారాయణ, రుఫియా పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎఒ

కనకమహాలక్ష్మి కో- ఆపరేటివ్ బ్యాంకు 26వ బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సహకార బ్యాంకులతోనే దేశ ఆర్థిక పురోగాభివృద్ధి సాధ్యమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ఆరిలోవలో ఏర్పాటు చేసిన 26వ శాఖను మేయర్ ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా ప్రజల అవసరాలకు సహకార బ్యాంకులు ఎంతగానో దోహదపడతాయన్నారు. తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ గడిచిన 25 ఏళ్లలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 25 శాఖలను ఏర్పాటు చేయడంతో పాటు 26వ శాఖను ఆరిలోవలో ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. జిల్లా సహకార శాఖ అధికారి టి.ప్రవీణ మాట్లాడుతూ కో-ఆపరేటివ్ రంగంలో సాంకేతికపరంగా అభివృద్ధి చెందిన బ్యాంకులలో కనకమహాలక్ష్మి, కో-ఆపరేటివ్ బ్యాంకు ఉత్తమమైనదన్నారు. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ రూ.785 కోట్ల డిపాజిట్లు, రూ.493 కోట్ల రుణాలతో సుమారుగా రూ.1280 కోట్ల వ్యాపారాన్ని తమ బ్యాంకు చేస్తుందన్నారు. కార్యక్రమంలో 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ సిహెచ్.రాఘవేంద్రరావు, మహరాజా కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ ఎంఆర్కె.రాజు, బ్యాంకు వైస్ ఛైర్మన్ జి.రామకృష్ణ, మాజీ ఛైర్మన్ పి.రఘునాథరావు, డైరెక్టర్లు, ముఖ్యకార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్‌కిషోర్ పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో మేయర్, తదితరులు

ప్రజలపై కేంద్ర ప్రభుత్వ భారాలు దారుణం

ప్రజాశక్తి-రోలుగుంట:కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని రోలుగుంట మండల సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. రోలుగుంట మండలం సిపిఎం ఆధ్వర్యంలో శనివారం రోలుగుంట మండలం రత్నంపేట, కొంతలం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రజలపై అనేక భారాలు పెరుగు తున్నాయన్నారు. నిత్యావసర ధరలు, గ్యాస్, కరెంట్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేట్ పరం చేస్తున్నారని విమర్శించారు. రైతులకి గిట్టుబాటు ధర కల్పించాలని, పెరిగిన ధరలను తక్షణమే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న చిరంజీవి